సాక్షి
జగిత్యాల
ఆదివారం । 23 । జూలై । 2023



నిలిచిన ప్రసవాలు

ధర్మపురి: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో కొద్దినెలలుగా ప్రసవాలు నిలిచిపోయాయి. గైనకాలజిస్ట్ లేకపోవడమే కారణం.

- 8లో



పులి వేషధారణలో..

జగిత్యాలటౌన్ :మొహర్రం వేడుకలను పురస్కరించుకుని భక్తులు పులివేషధారణ చేశారు. జాతీయ గీతాలాపన చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం 27.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇన్‌స్పెక్టర్‌కు అభినందన



అభినందిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: హైదరాబాద్‌లో జూన్ 14 నుంచి 21వ తేదీ వరకు జరిగిన 9వ తెలంగాణ స్టేట్ షూటింగ్ కాంపిటీషన్‌లో 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ షూటింగ్ విభాగంలో జగిత్యాల రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సైదులు గోల్డ్‌మెడల్ సాధించారు. ఆయనను శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ భాస్కర్ అభినందించారు.

త్వరలోనే పీఆర్సీ



సభ్యత్వ నమోదులో ప్రతినిధులు

జగిత్యాల: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్‌తో కూడిన పీఆర్సీ త్వరలోనే వస్తుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు తెలిపారు. శనివారం జిల్లాలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ, ఈనెల చివరి వరకు పెండింగ్ బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూటూరి మహేశ్, బాసిత్, గంగాధర్, పవన్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి ఇన్‌ఫ్లో



ఎస్సారెస్పీ

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు సాగు, తాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు భారీగా వరదనీరు వస్తోంది. కొద్దిరోజులుగా ఎగువన వర్షాలు కురుస్తుండటంతో వరద వచ్చి చేరుతోంది. శనివారం సాయంత్రం 6 గంటల వరకు 1,57,496 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్ట్ నీటిమట్టం 1,091.00 అడుగులకు 1,081.60 అడుగులుగా ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 90.3 టీఎంసీలకు ప్రస్తుతం 56.94 టీఎంసీలు ఉంది. ప్రాజెక్ట్ నుంచి 807 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది.

జాతీయ రహదారిపై నిలిచిన రాకపోకలు



రోడ్డుపై చెత్త తొలగిస్తున్న జేసీబీ

జగిత్యాలరూరల్: కొద్దిరోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు వాగులకు వరద పోటెత్తుతోంది. శుక్రవారం అర్ధరాత్రి జగిత్యాల రూరల్ మండలం అనంతారం సమీప జాతీయ రహదారిపై వరద ఉధృతి పెరిగింది. దీంతో రాత్రి నుంచి ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి వరదను శనివారం సమీక్షించారు. వరద తగ్గే వరకూ రాకపోకలు పునరుద్ధరించవద్దని అధికారులను ఆదేశించారు. దీంతో అనంతారం నుంచి తిప్పన్నపేట వరకు, గుల్లపేట నుంచి చిన్నాపూర్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. కొన్నింటిని గుల్లపేట, అర్పపల్లి, లక్ష్మీదేవిపల్లి, రంగపేట, పొరండ్ల, హన్మాజీపేట మీదుగా దారి మళ్లించారు. జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఎస్సై సదాకర్, రోడ్డు డ్యాం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయించారు.

జిల్లాలో సగటు వర్షపాతం 54.3మి.మీ.

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో శనివారం ఉదయం 8 గంటల వరకు 1,141 మి.మీ. వర్షపాతం నమోదైంది. సగటు వర్షపాతం 54.3 మి.మీ.గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇబ్రహీంపట్నంలో 70.5 మి.మీ., మల్లాపూర్‌లో 70.9మి.మీ., రాయికల్‌లో 155.4మి.మీ., బీర్‌పూర్‌లో 44.5మి.మీ., సారంగాపూర్‌లో 25.9 మి.మీ., ధర్మపురిలో 15.8మి.మీ., బుగ్గారంలో 9.6మి.మీ., జగిత్యాలరూరల్‌లో 104.2 మి.మీ., అర్బన్‌లో 51.8మి.మీ., మేడిపల్లిలో 74.6మి.మీ., కోరుట్లలో 65.3మి. మీ., మెట్‌పల్లిలో 55.3మి.మీ., కథలాపూర్‌లో 52.6మి.మీ., కొడిమ్యాలలో 40.4మి.మీ., మ ల్యాలలో 42.5మి.మీ., పెగడపల్లిలో 82.8మి. మీ., గొల్లపల్లిలో 38.2మి.మీ., వెల్గటూర్‌లో 18.8మి.మీ., ఎండపల్లిలో 18.2మి.మీ., భీమారంలో 49.4మి.మీ. వర్షపాతం నమోదైంది.

అగ్రికల్చర్‌లో డ్రెస్‌కోడ్

- మహిళల వస్త్రధారణలో మార్పులు
- వ్యవసాయ రంగంలో అనివార్యం
- చొక్కాలు, పైజామాలు ధరించి పనులు
- కొనడమే కాదు.. కుట్టించుకుంటున్నారు

సండే స్పెషల్



చొక్కాలు, పైజామాలు ధరించి కోరుట్ల శివారులోని ఓ పొలంలో నాట్లు వేస్తున్న మహిళలు

కోరుట్ల: వ్యవసాయ పనుల్లో మహిళల పాత్ర అత్యంత కీలకం. వరి నారు పోసినప్పటి నుంచి నాటు వేయడం, కలుపు తీయడం.. కోత కోయడం.. ఇలా అన్నింటా ఆమె భాగస్వామ్యం అమోఘం. అయితే, చీరకట్టుతో ఈ పనులు సాఫీగా చేసేందుకు కొన్ని చిక్కులు ఎదురవుతున్నాయి. వాటిని అధిగమించడానికి మహిళా రైతులే కాదు.. మహిళా కూలీలు సరికొత్తగా ఆలోచన చేస్తున్నారు. తమకు అనుకూలమైన, పనులకు అనువుగా ఉండే దుస్తులు వినియోగిస్తున్నారు. ఇందుకోసం పిల్లల పాత చొక్కాలు, పైజామాలు ధరిస్తూ వ్యవసాయ పనులు చకచకా చేస్తున్నారు. పాతవి లేకుంటే.. తమకు నచ్చిన తీరులో, సులభంగా పనులు చేసేందుకు వీలుగా ఉండే కొత్తవాటినీ కుట్టించుకుంటున్నారు.

అడుగడుగునా మహిళలే..

- వరినార్లు.. మక్క విత్తడం.. కలుపు.. కోత.. ఇలా వ్యవసాయ పనుల్లో అడుగడుగునా మహిళల పాత్ర కీలకమే.
- ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చినా.. ఈ రంగంలో మహిళలకు పని తగ్గలేదు.
- జిల్లాలో సుమారు 4.20 లక్షల ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉంది.
- మొత్తంగా 1.28 లక్షల మంది వరకు వ్యవసాయదారులు ఉన్నారు.
- వ్యవసాయ పనుల్లో చురుకైన పాత్ర పోషించే మహిళా కూలీలు, రైతుల సంఖ్య ఎంత తక్కువ అనుకున్నా సుమారు 87 వేలకు పైగానే ఉంటుందని అంచనా.
- వ్యవసాయ పనుల్లో పనిచేస్తున్న మహిళలు.. సంప్రదాయ చీరకట్టులో ఎదురవుతున్న అవస్థలను దూరం చేయడానికి డ్రెస్‌కోడ్ వైపు దృష్టి సారించడం విశేషం..

సౌకర్యం.. వెసులుబాటు

వరి నాట్లు, కోతల సమయంలో బురదలో పనిచేయాల్సి ఉంటుంది. దీంతో చీరకట్టుతో మహిళలు పనిచేయడం ఇబ్బందిగా ఉంటోంది. కలుపు తీసే సమయంలోనూ మట్టి, మొక్కల పసరు, బురద అంటుకుని చీరలు పాడవుతున్నాయి. బురద అంటుకున్న వస్త్రాలను పనుల తర్వాత శుభ్రం చేయడం సమస్యగా మారుతోంది. చీరకట్టు సాగు పనుల్లో అసౌకర్యంగానూ ఉంటోంది. శరీరాన్ని కప్పి ఉంచడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతోనే మహిళలు తమకు సౌకర్యంగా ఉండే చొక్కాలు, పైజామాలు ధరిస్తున్నారు.

కొనడమే కాదు.. కుట్టిస్తున్నారు



- సాధారణంగా ఇంట్లో ఎదిగిన పిల్లలు కలిగిన మహిళలు.. వారి పాత చొక్కాలు, పైజామాలు ధరిస్తూ వ్యవసాయ పనులు చేస్తున్నారు.
- కొందరు తమ ఇరుగుపొరుగు వారివి తీసుకుని వినియోగిస్తున్నారు.
- మరికొందరు తమకు అనువుగా ఉండేలా లేడీస్ టైలర్ల వద్ద కుట్టించుకుంటున్నారు.
- ఇందుకోసం పాత చీరలు వినియోగించుకుంటున్నారు.
- ఇంకొందరు వారసంతల్లో, వీధి వ్యాపారుల వద్ద తక్కువ ధరలకు దుస్తులు కొనుగోలు చేస్తున్నారు.

కాళ్లకు తట్టుకుంటది



చీర కట్టుకుని వరి నాటు వేస్తే బురదలో నానుతుంది. కాళ్లకు తట్టుకుంటుంది. ఒక్కోసారి పొలం ఒడ్డుపై నడిచేటప్పుడు జారిపడ్డం. పనిచేసే ప్రతీసారి కొంగు జారుతది. అందుకే.. మా పిల్లల పాత షర్ట్, పైజామా కట్టుకుంటున్న. వీటికి బురద అంటడం లేదు. పనిలో ఎలాంటి ఇబ్బంది ఉంటలేదు.

– లక్ష్మి, రైతు, సంగెం, కోరుట్ల

అవసరమైతే కుట్టిస్త



వరి నాట్ల సమయంలో బురదలో పనిజేస్తం. షర్ట్, పైజామా వేసుకుంటే పనులు జల్ది చేసుకోవచ్చు. ఇంట్ల పాత చీరలతో వీటిని కుట్టించుకుంటున్న. మా ఊరి టైలర్ వంద రూపాయాలు తీసుకుని నాకు నచ్చినట్లు, నాకు వచ్చేట్టు కుట్టి ఇస్తున్నరు. పైజామా, దానిపై అంగీ ఏసుకుని సులభంగా పనిచేయొచ్చు.

– నర్సు, వ్యవసాయ కూలీ, సంగెం, కోరుట్ల

చాలామంది డ్రెస్ వేస్తున్నారు



మహిళా రైతులు, కూలీలు షర్ట్‌లు, పైజామాలు ధరించి వ్యవసాయ పనులు చేస్తున్నారు. నిజానికి పనుల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఈ డ్రెస్‌లు పనికొస్తున్నాయి. ఈ రంగంలో ఆధునికత, సాంకేతికత చోటు చేసుకున్నట్లే.. సాగు పనుల్లో సౌలభ్యం కోసం దుస్తుల్లోనూ మార్పు అనివార్యమే.

– నాగమణి, ఏవో, కోరుట్ల

ఈవీఎంలపై అపోహలు వద్దు



ఓటుహక్కుపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

- కలెక్టర్ యాస్మిన్ బాషా

మెట్‌పల్లి(కోరుట్ల): ఈవీఎంలపై అపోహలు తొలగించడానికి జిల్లావ్యాప్తంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కేంద్రాన్ని శనివారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై అవగాహన కల్పించడం కోసం జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఉన్న ఆర్డీవో కార్యాలయాల్లో ప్రత్యేకంగా కేంద్రాలను, ఆరు మొబైల్ వ్యాన్‌లను ఏర్పాటు చేశామన్నారు. వీటిద్వారా ఓటర్లలో నెలకొన్న అపోహలు తొలగించడానికి అవకాశం ఉందని తెలిపారు. అలాగే ఓటర్ల జాబితాను ఎలాంటి లోపాలు లేకుండా రూపొందించేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందుకోసం 785మంది బీఎల్‌వోలను నియమించామని, వారిద్వారా కొత్త ఓటర్ల నమోదు, మరణించిన, వలస వెళ్లినవారి ఓట్లను తొలగిస్తామని కలెక్టర్ వివరించారు.

ఓటర్లలో చైతన్యం తేవాలి

కోరుట్ల: ఓటుహక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించి వారిని చైతన్య పరచాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం, వీవీ ప్యాట్ ప్రదర్శన కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించి వినియోగించుకునేలా చైతన్య పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ నీరటి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

- జిల్లా పంచాయతీ అధికారి దేవరాజం

సారంగాపూర్(జగిత్యాల): పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉన్నా గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం చేయరాదని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజం హెచ్చరించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం వారంరోజుల్లో సారంగాపూర్ మండలంలో పర్యటించే అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామల్లో పారిశుధ్య బృందం సభ్యులు అబ్బురపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ నుంచి పారిశుధ్యం, ఇతర గ్రామపంచాయతీల పరిధిలో నిర్వహించే శానిటేషన్, విద్యుత్ దీపాల నిర్వహణ, మంచినీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచడం వంటి పనులు చేపట్టడానికి అదనంగా కూలీలను నియమించుకోవాలని సూచించారు. గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా, పారిశుధ్యం సక్రమంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఫ్రైడే డ్రైడేగా పరిగణించేలా ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో శశికుమార్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవరాజ్

ప్రత్యే దృష్టి సారించాలి

జగిత్యాలరూరల్: గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శానిటేషన్‌పై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. వాతావరణంలో మార్పులతో తలెత్తే అనారోగ్య సమస్యలపై ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకంలో పండ్లమొక్కల పెంపుపై రైతులకు అవగాహన కల్పించాలాయన అన్నారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాల కోసం పోటీ

- బరిలో 15 గ్రామపంచాయతీలు
- సంపూర్ణ పారిశుధ్యం లక్ష్యం

పెగడపల్లి(ధర్మపురి): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2023 పురస్కారానికి జిల్లాలోని 15 గ్రామ పంచాయతీలు పోటీ పడుతున్నాయి. వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన వాటికి కేంద్ర ప్రభుత్వం అవార్డులు అందజేస్తుంది. అయితే, జిల్లాలోని 20 మండలాల్లో 380 గ్రామ పంచాయతీలు ఉండగా, అందులో 15 గ్రామాలను జనాభా ప్రాతిపదికన మూడు విభాగాలుగా విభజించి ఎంపిక చేశారు. 5 వేల జనాభా ఉన్న 5 గ్రామాలు, 5 వేల లోపు జనాభా ఉన్న మరో 5 గ్రామాలు, 2 వేల నుంచి 5 వేల వరకు జనాభా ఉన్న గ్రామాల జాబితా రూపొందించారు.

సౌకర్యాలు మెరుగు పడేలా..

- అవార్డుల కోసం పోటీపడే గ్రామాల్లో సౌకర్యాలు మెరుగుపడేలా అధికారులు ప్రణాళికలు తయారు చేశారు.
- ప్రధానంగా వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడుగుంతల తవ్వకం, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, వీటి ద్వారా సేంద్రియ ఎరువు తయారీ, గోబర్ గ్యాస్, ప్లాస్టిక్ నివారణ, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.
- గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో పోటీతత్వం పెంపొందించేందుకు కేంద్రంప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ పురస్కారాలు అందించేందుకు ర్యాంకులు ప్రకటిస్తోంది.
- పురస్కారాల కోసం ఎంపికైన గ్రామాల్లో కేంద్ర బృందం త్వరలోనే వివిధ అంశాలను పర్యవేక్షించే అవకాశం ఉంది.
- ఈ బృందం గ్రామాలను పర్యవేక్షించాక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తుంది.
- ఉత్తమ పనితీరు కనబర్చిన పంచాయతీకి వెయ్యి మార్కులు వేస్తారు.
- వీటి ఆధారంగా ర్యాంకులు ప్రకటిస్తారు.
- ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన వాటికి మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఢిల్లీలో పురస్కారాలు అందజేస్తారు.



మద్దులపల్లిలోని పల్లె ప్రకృతివనం

జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలు

మండలం	గ్రామం
పెగడపల్లి	మద్దులపల్లి
బుగ్గారం	చిన్నాపూర్
మల్లాపూర్	నడికుడ
కోరుట్ల	గుమ్లాపూర్
మెట్‌పల్లి	చింతలపేట
గొల్లపల్లి	రాఘవపట్నం, వెంగళాపూర్
రాయికల్	భూపతిపూర్
కొడిమ్యాల	నామపల్లి
మల్యాల	తాటిపల్లి
ఇబ్రహీంపట్నం	ఇబ్రహీంపట్నం
జగిత్యాల రూరల్	చలిగల్
రాయికల్	అల్లిపూర్
మెట్‌పల్లి	వెల్లుల్ల
ధర్మపురి	మగ్గిడిఎడపల్లి

అవార్డు సాధన లక్ష్యం



స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2023 అవార్డు సాధించేందుకు మా గ్రామాన్ని అధికారులు ఎంపికచేశారు. వారు సూచించిన అభివృద్ధి పనులు పూర్తిచేసి అవార్డు తీసుకునేందుకు పోటీపడుతున్నాం. జిల్లాలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు మా ఊరును ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. – గుర్రం అనూష, సర్పంచ్, మద్దులపల్లి

సన్నద్ధం చేస్తున్నాం



స్వచ్ఛ సర్వేక్షణ్ – 2023 పురస్కారాల కోసం ఎంపిక చేసిన గ్రామాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. పనులు వందశాతం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కేంద్రబృందం వచ్చేలోగా ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిచేస్తాం. అవార్డు అందుకునేలా సన్నద్ధం చేస్తున్నాం. – దేవరాజ్, డీపీవో

అసంపూర్తి పనులు పూర్తిచేయండి

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని తక్షణమే పూర్తిచేయాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంతోపాటు గోదావరి తీర ప్రాంతాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సందర్శించారు. వివిధ వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీల వ్యవస్థ తీరుపై ఆరా తీశారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కు సమస్యలపై వివరించారు. అభివృద్ధి పేరిట చేపట్టిన రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం పూర్తిచేయడం లేదన్నారు. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమీకృత మార్కెట్‌ను ప్రారంభించక పోవడంతో రైతులు, వ్యాపారులు రోడ్లపై అమ్మకాలు చేస్తున్నారని అన్నారు. వర్షానికి నానుతూ, ఎండకు ఎండుతూ అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలూ ఎదురవుతున్నాయని చెప్పారు. మంత్రి తక్షణం స్పందించి సమీకృత మార్కెట్ త్వరితగతిన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజేశ్, సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ, చిలుముల లక్ష్మణ్, అశెట్టి శ్రీనివాస్, వొజ్జల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ గెలుపు ఖాయం

బుగ్గారం(ధర్మపురి): రానున్న అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పార్టీలోని వివిధ విభాగాలకు నూతన బాధ్యులను నియమించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బుగ్గారానికి చెందిన సిగిరి అంజిత్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా, గోపులాపూర్ గ్రామానికి చెందిన బీర్పూర్ తిరుపతిని మండల యూత్ అధ్యక్షుడిగా నియమించారు. నాయకులు వేముల సుభాష్, సింహరాజు ప్రసాద్, కండ్లె మదన్, నగునూరి నర్సాగౌడ్, గోవిందుల రమణ, బీర్పూర్ శ్రీనివాస్, నక్క శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సూరమ్మ ప్రాజెక్టు పనుల్లో జాప్యం ఎందుకు?

- కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): వేములవాడ నియోజకవర్గంలో కథలాపూర్, మేడిపెల్లి, భీమారం మండలాలకు సాగు నీరు అందించే సూరమ్మ ప్రాజెక్టు పనుల్లో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. శనివారం భీమారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. అనంతరం జరిగినసమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సూరమ్మ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ పనులకు 2018 ఎన్నికలకు ముందు మంత్రి హరీశ్‌రావు భూమిపూజ చేశారని గుర్తుచేశారు. ఇప్పటివరకు తట్టెడు మట్టి కూడా తీయలేదని మండిపడ్డారు. ఓట్లు దండుకొని రైతుల నోట్లో మట్టి కొట్టేలా వ్యవహరించడం దారుణమన్నారు. ఈ ప్రాంత నాయకులతో స్వయంగా సీఎం కేసీఆర్ సమావేశం నిర్వహించి సూరమ్మ ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందిస్తామని చెప్పినా.. అమలు కాకపోవడం సిగ్గుచేటన్నారు. వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు వైఫల్యంతోనే ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదని ధ్వజమెత్తారు. ఎన్నికలప్పుడు మోసపూరిత హామీలు ఇచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రైతులు బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, అజీమ్, మల్లేశం, హరిప్రసాద్, ముంజ కిషన్‌గౌడ్, ప్రశాంత్, గణేశ్, సయ్యద్, వినయ్‌కుమార్, మహేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.



దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలుపుతున్న నాయకులు

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీవో



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్డీవో

మెట్‌పల్లి(కోరుట్ల): కోరుట్ల ఆర్డీవో బాధ్యతలు చేపట్టిన రాజేశ్వర్.. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్ పరిధిలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి



హరీశ్‌రావుతో సంజయ్‌కుమార్, రమణ

జగిత్యాల:జగిత్యాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో వైద్య, ఆరోగ్య శాఖమంత్రి హరీశ్ రావును వారు శనివారం కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. స్పందించిన మంత్రి.. నిధులు మంజూరు చేసేందుకు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



బెల్లం పానకం పారబోస్తున్న అధికారులు

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్, భీమారం మండలాల్లోని పలు గ్రామాల్లో నాటుసారా తయారీ స్థావరాలపై ఆబ్కారీ, పోలీస్ అధికారులు వేర్వేరుగా దాడులు చేశారు. నిర్వాహకులపై శనివారం కేసులు నమోదు చేశారు. కథలాపూర్ మండలం కలిగోట గిరిజన తండాలో ఆబ్కారీశాఖ ఆధ్వర్యంలో ఓ మహిళ ఇంట్లో ఉన్న 2 లీటర్ల నాటుసారా పట్టుకొని 50 లీటర్ల బెల్లం పానకం పారబోశారు. భీమారం మండలం రాజలింగంపేట తండాలో పోలీసులు తనిఖీలు చేసి 5 లీటర్ల నాటుసారా పట్టుకొని 50 లీటర్ల ముడిసరుకులు ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఆబ్కారీ శాఖ మెట్‌పల్లి సీఐ రాధ, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ అశోక్, మేడిపెల్లి ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.

నిలిచిన ప్రసవాలు

- భర్తీకి నోచని గైనకాలజిస్ట్ పోస్టు
- మూడు నెలలుగా ఇదే పరిస్థితి
- ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రిలో దుస్థితి



ధర్మపురిలోని ప్రభుత్వ ఆస్పత్రి



వెలవెలబోతున్న లేబర్ రూమ్

ఈ ఏడాదిలో జరిగిన ప్రసవాలు

జనవరి	15
ఫిబ్రవరి	12
మార్చి	12
ఏప్రిల్	12
మే	06
జూన్	01
జూలై(ఇప్పటివరకు)	0

ధర్మపురి: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి స్థాయిని ఇటీవల 30 పడకల నుంచి 50 పడకలకు పెంచారు. దీంతో పది నెలల క్రితం వైద్య, విధాన పరిషత్ అధీనంలోకి వెళ్లింది. ఆస్పత్రిలో సకల సౌకర్యాలు ఉన్నాయి. కానీ, సిబ్బంది కొరత వేధిస్తోంది. చాలామంది డెప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ధర్మపురి, బీర్‌పూర్, సారంగాపూర్, వెల్గటూర్, బుగ్గారం మండలాల నుంచి వేల సంఖ్యలో పేషెంట్లు ఇక్కడకు వస్తున్నారు. వీరికి మెరుగైన వైద్యం సకాలంలో అందక అవస్థలు పడుతున్నారు.

గైనకాలజిస్ట్ లేక..

- ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఊరూరా, ఇంటింటా తిరిగి గర్భిణులను గుర్తిస్తున్నారు.
- గర్భం దాల్చిన సమయం నుంచి డెలివరీ అయ్యే వరకూ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చి అన్నివైద్య పరీక్షలు చేయిస్తున్నారు.
- ఈ ప్రక్రియ ప్రతినెలా క్రమం తప్పకుండా సాగుతోంది.
- అన్ని పరీక్షలు ఉచితం, డెలివరీ సేవలు ఉచితంగా అందడంతోపాటు నగదు, ఇతర్రా ప్రోత్సాహకాలు అందడంతో గర్భిణులు ఇక్కడే పురుడు పోసుకునేందుకు వస్తున్నారు.
- కానీ, ఈ సేవలు అందించాల్సిన గైనకాలజిస్ట్ లేక అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.
- అంతేకాదు.. ఈ ఏడాదిలో ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోంది.
- గత జనవరి నుంచి మే రెండోవారం వరకు 57 ప్రసవాలు జరిగాయి.
- జూన్‌లో ఒకటి మాత్రమే నార్మల్ డెలివరీ అయింది.

నిలిచిన ప్రసవాలు..

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మొన్నటివరకు విధులు నిర్వర్తించిన గైనకాలజిస్ట్ వివిధ కారణాలతో సస్పెన్షన్‌లో ఉన్నారు. ఆమె మే రెండోవారం వరకు మాత్రమే పనిచేశారు. ఆ తర్వాత నుంచి విధులకు రావడం లేదు. అప్పటినుంచి గైనకాలజిస్ట్ పోస్టు ఖాళీగా ఉంటోంది. దీంతో ప్రసవాలు నిలిచి పోయాయి.

ప్రైవేట్‌లో రూ.వేలు వెచ్చించలేక..

- పేద గర్భిణులు ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లోకి వెళ్లాల్సి వస్తోంది.
- అక్కడ పురుడు పోసేందుకు రూ.వేలల్లో బిల్లులు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు.
- స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సకలసౌకర్యాలు ఉన్నాయి.
- కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నారు.
- అత్యవసర సమయాల్లో అవసరమయ్యే ఆక్సిజన్ ప్లాంట్ ఉంది.
- పిల్లల వైద్య నిపుణులు, ఈఎన్‌టీ తదితర వైద్య నిపుణులను డెప్యుటేషన్‌పై నియమించారు.
- కానీ, మూడు నెలలుగా గైనకాలజిస్టును నియమించడంలేదు.
- ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు నిలిచిపోయాయి.
- పేదలు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

జగిత్యాలకు పోయిన



డెలివరీ కోసం ధర్మపురి ఆస్పత్రికి పోయిన. గైనకాలజిస్ట్ లేరని చెప్పిండ్రు. జగిత్యాల ఎంసీహెచ్‌కు పంపించిండ్రు. అక్కడే డెలివరీ అయిన. పాప పుట్టింది. పాపకు వైద్యం కోసం వచ్చిన.

– లావణ్య, బాలింత, దమ్మన్నపేట.

ఉన్నాధికారులకు నివేదించాం



ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ పోస్టు ఖాళీగా ఉంది. వైద్యురాలు లేక డెలివరీల సంఖ్య తగ్గింది. గత జూన్‌లో ఒకటి నార్మల్ డెలివరీ మాత్రమే చేశాం. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ ద్వారా జగిత్యాల ఏరియా ఆస్పత్రికి గర్భిణులను తరలిస్తున్నాం. గైనకాలజిస్ట్ నియామకం కోసం ఉన్నతాధికారులకు నివేదిక అంజేశాం.

– నవీన్, డాక్టర్, ప్రభుత్వ ఆస్పత్రి

బీఆర్‌ఎస్‌తోనే పేదలకు మేలు



లబ్ధిదారులతో ఎమ్మెల్యే, కలెక్టర్

మెట్‌పల్లి(కోరుట్ల): బీఆర్‌ఎస్ హయాంలోనే పేదలకు అన్నివిధాలా మేలు జరుగుతోందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఇల్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యేతోపాటు కలెక్టర్ యాస్మిన్‌బాషా పాల్గొన్నారు. కోనరావుపేటకు చెందిన 171మంది మహిళలకు ఇళ్లస్థలాలను మంజూరు చేయగా, ఇందుకు సంబంధించిన పట్టాలను ఎమ్మెల్యే, కలెక్టర్ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కోనరావుపేటలో ఇందిరమ్మ ఫేజ్–3 కింద ఎంపిక చేసిన స్థలంలో అర్హులైన వారికి పట్టాలను అందజేశామన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భీమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌ను నియమించాలి

మెట్‌పల్లి(కోరుట్ల):మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌కు ఐఏఎస్ అధికారిని నియమించాలని మర్కజీ ఇంతేజామి కమిటీ అధ్యక్షుడు ఖుత్బొద్దీన్ శనివారం కోరారు. మొన్నటి వరకు కోరుట్ల ఆర్డీవోకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారని, కొన్నిసంవత్సరాలుగా రెగ్యులర్ అధికారిని నియమించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పోస్టులో ఇంకా ఎవరినీ నియమించలేదని, దీనివల్ల పలు పనులు పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. ఆర్డీవోకు బదులు ఐఏఎస్ అధికారిని నియమించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీజేపీ పాలనలో భద్రత లేదు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

కరీంనగర్: కేంద్రంలో బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చాక దేశ ప్రజలకు భద్రత కరువైందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగిస్తున్నా ప్రధాని నరేంద్రమోడీ, హోం శాఖ మంత్రి అమిత్‌షా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దేశరక్షణ కోసం పని చేసిన సైనికుడు తన కుటుంబాన్ని రక్షించుకునే పరిస్థితి లేదని అన్నారు. మణిపూర్ ప్రజలకు సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆర్టీసీని పరిరక్షించుకోవాలని, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, యూనియన్లు లేకపోవడంతో కార్మికుల హక్కులు హరించబడుతున్నాయన్నారు. ఆర్టీసీని పరిరక్షించాలని అన్ని డిపోల వద్ద అఖిల పక్షపార్టీలు, ప్రజాసంఘాలు, కార్మికుల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, కొయ్యడ సృజన్ కుమార్, అందె స్వామి, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బత్తుల బాబు, బండ రాజిరెడ్డి పాల్గొన్నారు.

వర్గీకరణ చేపట్టాలి

- ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి నాగభూషణం



మాట్లాడుతున్న నాగభూషణం

కథలాపూర్(కోరుట్ల): ఎస్సీ వర్గీకరణకు ఏళ్లుగా ఉద్యమిస్తున్నామని, ఈ పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి నాగభూషణం డిమాండ్ చేశారు. శనివారం కథలాపూర్ మండలకేంద్రంలో 'చలో జగిత్యాల' వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం ఈనెల 27న జగిత్యాలలో సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సకాలంలో స్పందించకపోతే హైదరాబాద్‌లో లక్షలాది మందితో విశ్వరూప మహాసభ నిర్వహించి తమ సత్తా చూపిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలో జగిత్యాలలో నిర్వహించే సభకు ఎస్సీ ఉపకులాలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు కాశవత్తుల లక్ష్మీరాజం, జిల్లా కో కన్వీనర్ బలవంతుల సురేశ్, నాయకులు దూడ పురుషోత్తం, ఆమెటరాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'అల్ఫోర్స్ డాజిల్-2023'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): హన్మకొండలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన 'అల్ఫోర్స్ డాజిల్-2023' అలరించింది. హన్మకొండలోని ఓ ప్రైవేట్ వేడుక మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా జ్ఞాన సరస్వతీదేవి విగ్రహానికి పూల మాల వేసిన అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా. వి.నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అత్యుత్తమ ప్రదనర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చర్మ సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

గొల్లపల్లి(ధర్మపురి): విద్యార్థులు చర్మ సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో 240 విద్యార్థినులకు శనివారం వైద్య పరీక్షలు చేశారు. 145 మందికి మందులు పంపిణీ చేశారు. కాలానుగుణ మార్పులతోనేకాదు.. ఆహారపు అలవాట్లతో చాలామంది చర్మ సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. చర్మ సంరక్షణ కోసం కాసేపు సూర్యరశ్మిలో గడపాలని సూచించారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాధిక రాణి, ప్రిన్సిపాల్ పద్మ, సూపర్‌వైజర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు దూరంగా ఉండలేక..

- విద్యార్థిని ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి



సంకీర్తన (ఫైల్)

ధర్మారం: ఉన్నత చదువులు చదివించాలనే తల్లిదండ్రుల తపన.. చదువు కోసం తల్లిదండ్రులకు దూరంగా ఉండలేక తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యయత్నంకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖిలావనపర్తికి చెందిన కనుకట్ల కమల్–రేఖ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు సంకీర్తన జూలపల్లి మండలం తెలుకుంట కస్తూర్బిభా గాంధీ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. వేసవి సెలవుల్లో ఇంట్లో ఉన్న సంకీర్తనను పాఠశాలలు ప్రారంభమైన తర్వాత తల్లిదండ్రులు కస్తూరిబా విద్యాలయానికి వెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులను వదిలి వెళ్లలేక కొంత సమయం తీసుకుంది. అయితే ఈనెల 15న రేపు విద్యాలయానికి తీసుకెళ్తానని, వస్తువులు సర్దుకోవాలని కూతురు సంకీర్తనకు తండ్రి కమల్ చెప్పి రైస్‌మిల్లులో పనిచేసేందుకు వెళ్లాడు. తల్లిదండ్రులకు దూరంగా ఉండటం ఇష్టం లేక మానసిక వేదనకు గురై ఇంట్లో రేకుల షెడ్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యయత్నంకు పాల్పడింది. గమనించిన స్థానికులు వెంటనే తండ్రికి సమాచారం అందించి పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి కమల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

కొరియర్ డెలివరీ బాయ్‌పై దాడి : కేసు నమోదు

సారంగాపూర్(జగిత్యాల): రేచపల్లి గ్రామానికి ఓ పార్శిల్ డెలివరీ చేయడానికి వెళ్లిన బాయ్‌ను అకారణంగా కొట్టి, గాయపరచిన వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. ధర్మపురి పట్టణంలో ఓ ప్రైవేట్ కొరియర్‌లో అదే ప్రాంతానికి చెందిన నర్ముల్ల కిషన్ పనిచేస్తున్నాడు. అయితే, సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలోని ఓ వ్యక్తికి పార్శిల్ రావడంతో కిషన్.. రేచపల్లికి వెళ్లాడు. డెలివరీ చేయడానికి అదని చిరునామా కోసం ప్రయత్నం చేస్తున్నాడు. పార్శిల్ తీసుకోవాల్సిన వ్యక్తి ఇంటి అడ్రస్ దొరకకపోవడంతో కిషన్ సదరు కవర్‌పై ఉన్న నంబబర్‌కు ఫోన్‌చేశాడు. అడ్రస్ ఎక్కడ? అని అడిగాడు. కవర్ తీసుకోవాలిన్న వ్యక్తి అడ్రస్ చెప్పడంతో కిషన్ డెలివరీ చేయడానికి ఆ అడ్రస్‌కు వెళ్లాడు. అక్కడకు చేరుకున్నాక.. కొరియర్‌తో సంబంధం లేని రేచపల్లికి చెందిన సతీశ్.. కిషన్‌ను అసభ్యంగా దూషించాడు. అడ్రస్ వెతికి పట్టుకుని పార్శిల్ ఇవ్వాలంటూ ఆగ్రహంతో కట్టెతో దాడిచేసి కిషన్ తీవ్రంగా గాయపరిచాడు. కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సతీశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ఎద్దు మృతి



మృత్యువాత పడిన ఎద్దు

మంథని: మంథని మండలం నాగారంలో కొడారి కొమురయ్యకు చెందిన ఎద్దు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృత్యువాత పడింది. శనివారం అటువైపుగా మేతకు వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎద్దు తోక తగలడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉండడంతో ప్రమాదం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల కన్నాల గ్రామానికి చెందిన శంకర్ విద్యుత్ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికార్ల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు.

జగిత్యాలలో 'జోయలుక్కాస్'



ప్రదర్శన ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్

- మూడు రోజుల పాటు ఆభరణాల ప్రదర్శన

జగిత్యాల: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆభరణాల వర్తకులైన జోయలుక్కాస్ వారు జగిత్యాలలో ఆభరణాల ప్రదర్శన ప్రారంభించారు. మూడు రోజుల పాటు సాగే ఆభరణాల ప్రదర్శనను మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, జగిత్యాలలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆభరణాల వర్తకులైన జోయలుక్కాస్ వారు ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జోయలుక్కాస్ తెలంగాణ రీజినల్ మేనేజర్ రోబిన్‌తంబి, వినియోగదారులు పాల్గొన్నారు.

బావిలో కేజీవీల్స్ ట్రాక్టర్

- తోసేసిన అగంతకులు
- క్రేన్ సాయంతో బయటకు తీత



కేజీవీల్స్ ట్రాక్టన్‌ను బయటకు తీస్తున్న క్రేన్

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ ఉప సర్పంచ్ పన్నాల రఘుకు చెందిన కేజీవీల్స్ ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ బావిలోకి తోసేశారు. వివరాల్లోకి వెళ్తే.. వర్షాలు కురుస్తుండటంతో ఓ రైతు తన పొలం దున్నేందుకు కేజీవీల్స్ ట్రాక్టర్‌ను అద్దెకు పంపాలని రఘును కోరాడు. దీంతో, రఘు కేజీవీల్స్ ట్రాక్టర్, డ్రైవర్‌ను ఇచ్చి అక్కడకు పంపించాడు. అయితే, కొద్దిసేపు పొలం దున్నిన తర్వాత, రాత్రి కావడంతో డ్రైవర్.. కేజీవీల్స్ ట్రాక్టర్‌ను పొలంలోనే ఉంచి ఇంటికి వచ్చాడు. మరుసటిరోజు ఉదయం వెళ్లి చూసేసరికి ట్రాక్టర్ కనపడలేదు. సమీపంలోని వ్యవసాయ బావిలో చూడగా, అందులో పడిఉంది. దీంతో, జగిత్యాల నుంచి క్రేన్లు తెప్పించి వ్యవసాయ బావి నుంచి ట్రాక్టర్‌ను బయటకు తీశారు. ట్రాక్టర్ ధ్వంసం అవడమే కాకుండా, ఇంజిన్ లోపలి భాగంలోకి నీరు పోయి నడవని పరిస్థితి ఏర్పడింది. ఎవరోగిట్టని వ్యక్తులే ట్రాక్టర్‌ను బావిలో పడేసినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కారు, బైక్ ఢీకొని గాయాలు



సంఘటన స్థలంలో పడిపోయిన దంపతులు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన గంగాధర్, రమాదేవి దంపతులు శనివారం పనినిమిత్తం జగిత్యాలకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈక్రమంలో వీరి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు.